సాక్షి తిరుపతి

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



వర్ణ శోభితం.. కృష్ణమందిరం

శ్రీకష్ణాజన్మాష్టమికి ఇస్కాన్ వర్ణశోభితంగా ముస్తాబైంది. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతోంది. - 8లో



18 నాటికి శ్రీనివాస సేతు పూర్తి కావాలి

ఈ నెల 18వ తేదీన శ్రీనివాససేతు ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	24
చిత్తూరు	34	25
తిరుమల	30	21
గూడూరు	37	28
నగరి	35	26

న్యూస్‌రీల్

ఇక మండలస్థాయిలో 'జగనన్నకు చెబుదాం'



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రభుత్వం ఇకపై మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను చేపట్టనున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఆ మేరకు ఈ నెల 8వ తేదీన చిట్టమూరు మండలం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు. 2024 జనవరి 5వ తేదీనాటికి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది మే 9వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లాలో అనేక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ఇకపై మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేయాలన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,946 మంది శ్రీవారిని దర్శించుకోగా.. 30,294 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.51 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్రమబద్ధీకరణ.. చారిత్రక ఘట్టం



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి. చిత్రంలో కలెక్టర్, మేయర్ తదితరులు

క్రయ విక్రయాలకు నోచని ఇళ్లు, భూములు.. దశాబ్దాలుగా ఆస్తులున్నా అనుభవించలేని దుస్థితి తొలగిన వేళ.. నగర వాసుల్లో ఆనందం నిండిన వేళ ఓ చారిత్రక ఘట్టం అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అభివర్ణించారు.

- 22ఏ చెర నుంచి నగరవాసులకు విముక్తి
- దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం
- తలెత్తుకునేలా తిరుపతి అభివృద్ధి
- ప్రజలకు మంచి చేకూరే ప్రతి పనినీ పూర్తి చేస్తాం
- క్రమబద్ధీకరణ ఆర్డర్ కాపీల పంపిణీలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: నగరంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రమబద్ధీకరణ తిరుపతి చరిత్రలో ఓ చారిత్రక ఘట్టమని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అభివర్ణించారు. 22ఏ నిషేధిత జాబితా నుంచి 104 ఎకరాలను తొలగించడంతో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో బుధవారం లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఆర్డర్ కాపీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ నిషేధిత జాబితా సెక్షన్ 22ఏ చెర నుంచి ప్రజల భూములకు విముక్తి కల్పించామని, రాబోవు రోజుల్లో దశల వారీ మరింత మంది కుటుంబాల్లో వెలుగులు నింపుతామన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు నిషేధిత జాబితాలో ఉండడంతో రిజిస్ట్రేషన్లు చేసుకోలేక, క్రయవిక్రయాలకు నోచుకోక ప్రజలు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. జగనన్న పెద్ద మనస్సుతో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న 104 ఎకరాల భూములను ఆ జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. బుధవారం సాయంత్రం 5 గంటల తరువాత బటన్ నొక్కి ఆర్డర్ కాపీలను విడుదల చేయడంతో ఆ నిషేధిత మహమ్మారి నుంచి ప్రజల భూములకు విముక్తి లభించిందన్నారు. నిర్దేశించిన ఆ ప్రాంతాల్లోని భూముల క్రమబద్ధీకరణ గురువారం నుంచే చేసుకోవచ్చన్నారు. దీంతో 5,341 కుటుంబాలకు చెందిన సుమారు 20 వేల మందికి లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేశారు. నిషేధిత జాబితా నుంచి మరో 14 వేల మందికి చెందిన భూములకు త్వరలోనే విముక్తి కల్పిస్తామని చెప్పారు. దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. ప్రజలకు మంచి చేకూరుతుందన్న ప్రతి పనిని సాకారం చేస్తామని చెప్పారు. చంద్రబాబు హయాంలో నిషేధిత జాబితా నుంచి పేదల భూములను తొలగిస్తామని నమ్మబలికి రూ.లక్షల్లో నగదు వసూళ్లు చేశారని ఆరోపించారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని పారదర్శకంగా , ఎక్కడా ఒక రూపాయి అవినీతికి తావులేకుండా తాము చేశామని చెప్పారు. జగనన్న సహకారంతో తిరుపతిని అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. బృహత్ ప్రణాళికలతో చేపట్టిన అభివృద్ధితో తిరుపతి దశ, దిశ మారబోతుందని ఆయన అన్నారు. తిరుపతి ఈ మంచి పనులు చేశామని మీ ముందుకు తలెత్తుకుని సగౌరవంగా వస్తామే తప్ప, అందరిలా తలదించుకుని వచ్చేవాళ్లం కాదన్నారు. ప్రతి అవకాశాన్ని ప్రజల కోసం, తిరుపతి అభివృద్ధి కోసమే ఉపయోగిస్తున్నామని చెప్పారు. మాకు, మా కుటుంబానికి మంచి జరిగిందని భావించిన ప్రతి ఒక్కరూ పేదలందరికీ మంచి చేసే జగనన్న ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నాన్ని అడ్డుకోవాలన్నారు. పేదవర్గాలకు మంచి చేకూరుతుంటే ఓర్వలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు అరాచకపు మాటలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకోకపోతే చంద్రబాబు రాక్షస పాలన మళ్లీ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమనను లబ్ధిదారులు గజమాలతో సత్కరించారు. నగర మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ స్థలాలు, ఇళ్లపై సర్వహక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడం ప్రజలకు గొప్ప వరమనే చెప్పాలన్నారు. ఎమ్మెల్యే చొరవతో నగరం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. క్రమబద్ధీకరణతో వేలాది కుటుంబాల్లో ఆనందం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, ఆర్డీఓ కనకనరసారెడ్డి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇది ఎమ్మెల్యే విజయం

నిషేధిత జాబితా నుంచి ప్రజల భూములకు సర్వహక్కులు కల్పించేందుకు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పట్టు వదలని విక్రమార్కుడిలా సాధించారు. పక్కా ప్రతిపాదనలతో రికార్డులు సిద్ధం చేయించి, ఈ అంశంపై పలుసార్లు సీఎంతో చర్చించి ఆమోద ముద్ర వేసుకొచ్చారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా నిస్వార్థంగా ప్రజలకు మంచి చేయాలని తలచి ఇంతటి ఘనతను సాధించారు. గతంలో 2,500మందికి లబ్ధి చేకూరేలా 22ఏ జాబితా నుంచి తొలగించేందుకు కృషి చేశారు. మరికొన్ని భూములకు విముక్తి కలిగించేలా చర్యలు ప్రారంభమయ్యాయి.



లబ్ధిదారుకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన



క్రమబద్ధీకరణ ఆర్డర్ కాపీ పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు



సీఎం కటౌట్ ఎదుట జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు

గడువు వరకు రేషన్ పంపిణీ చేయండి

తిరుపతి అర్బన్: చౌకదుకాణాల డీలర్లు ప్రతి తెల్లకార్డుదారులకు ప్రభుత్వం విధించిన గడువు వరకు బియ్యంతోపాటు ఇతర సరకులు పంపిణీ చేయాలని సివిల్ సప్లైస్ జిల్లా అధికారి రాజా రఘువీర్ బుధవారం తెలిపారు. తూకాల్లో తేడాలు లేకుండా సరుకులు అందజేయాలన్నారు. ఎండీయూ వాహనచోదకులు రేషన్ కార్డుదారులతో గౌరవంగా నడుచుకోవాలన్నారు. డీలర్లు సకాలంలో డీడీలు కట్టాలని సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ వై.సుమతి పేర్కొన్నారు.

కార్మికుల జీవితాల్లో వెలుగులు



కార్మికురాలికి చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా, చిత్రంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

- ఎస్వీ షుగర్స్‌ను రెండు సార్లు మూయించిన ఘనత బాబుదే
- రైతుల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వేతన బకాయిలు రూ.21.36 కోట్లు విడుదల
- కార్మికులకు చెక్కుల పంపిణీ

రేణిగుంట: మూడు దశాబ్దాలపాటు విరాజిల్లిన గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీని దురుద్దేశపూరితంగా రెండుసార్లు మూయించి, రైతుల పొట్టకొట్టిన ఘనత చంద్రబాబుదేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యంలోని ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఫ్యాక్టరీ కార్మికులకు వేతన బకాయిల మొత్తం రూ.21.36 కోట్ల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం 368 మంది కార్మికులకు సంబంధించిన వేతన బకాయిలు రూ.21.36 కోట్ల నగదు చెక్కులను ఆమె పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ లాభాలబాటలో పయనిస్తున్న ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీని స్వార్థ ప్రయోజనాల కోసం 2003లో ఒకసారి మూసేస్తే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయిన వెంటనే 2004లో పునఃప్రారంభించారన్నారు. అయితే 2014లో చంద్రబాబు మళ్లీ ఎస్వీ షుగర్స్‌తోపాటు చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీని, చిత్తూరు విజయ డెయిరీని మూసి వేసి జిల్లా రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. అయితే తాము ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, రైతుల కష్టాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించడంతో షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల వేతన బకాయిలు 9 ఏళ్లకు సంబంధించి రూ.21.36 కోట్లు విడుదల చేశారన్నారు. ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలోనే ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ కోసం ఈ ప్రాంత రైతులు పడుతున్న కష్టాలను తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. అయితే జగనన్న ఇప్పటికే రైతుల బకాయిలను పూర్తిగా చెల్లించగా, ఇప్పుడు కార్మికులకు వేతన బకాయిలను చెల్లించారన్నారు. తాను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30ఏళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపానన్నారు. ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ హెరిటేజ్ కంపెనీ కోసం జిల్లాలో విజయ డెయిరీని మూసేసి పాడి రైతులకు చంద్రబాబు తీరని ద్రోహం చేశారని చెప్పారు. అనంతరం 368 మంది కార్మికులకు చెక్కులను పంపిణీ చేశారు. వారందరికీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ ఎండీ రవిబాబు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆదికేశవరెడ్డి, రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్యారాణి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటరమణారెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్, నగేషం, మునిశేఖర్‌రెడ్డి, రహీం, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కార్మికులు

చంద్రబాబు, చినబాబు జైలుకెళ్లడం ఖాయం

త్వరలోనే టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ జైలుకెళ్లడం ఖాయమని మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. గాజులమండ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అమరావతిలో రూ.2వేల కోట్లకు పైగా అక్రమాలు చేసి, ఐటీ నోటీసులిచ్చినా చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ తేలు కుట్టిన దొంగల్లాగా మౌనంగా ఉన్నారని విమర్శించారు. సీఆర్‌డీఏను 'చంద్రబాబు రియల్ దోపిడీ అథారిటీ'గా మార్చేశారని, ఈ వ్యవహారంలో మరిన్ని అక్రమాలు వెలుగు చూసి చంద్రబాబు, లోకేష్ త్వరలోనే జైలుకెళతారన్నారు. ఇంత జరుగుతున్నా దత్తపుత్రుడు ఎందుకు నిలదీయలేదని, చంద్రబాబు చేసిన అక్రమాల్లో పవన్‌కల్యాణ్‌కు ప్యాకేజీ అందిందా..? అనేది ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రిపై విమర్శలు చేశారని, అయితే అమరావతి అక్రమాలపై చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులిచ్చినా ఎందుకు నోరు మెదపలేదని ఆమె ప్రశ్నించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సత్యహరిశ్చంద్రుడు బతికి ఉంటే చంద్రబాబు చెప్పే అబద్ధాలకు తల పగలగొట్టుకుని చచ్చిపోయేవారన్నారు. బాబు బూటకపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి తేలదన్నారు. 2024లోనూ జగనన్న మరిన్ని ఎక్కువ సీట్లతో ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.

9న జూనియర్ బాలబాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంట క్రీడా మైదానంలో ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటల నుంచి జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సుధాకర్, ఎ.రెడ్డప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు బాలురు 2008 జనవరి ఒకటి నుంచి 2009 డిసెంబర్ 31వ తేదీ మధ్య, బాలికలు 2007 జనవరి ఒకటి నుంచి 2009 డిసెంబర్ 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే బాలబాలికలు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 99639 98853, 95733 61459నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉప సర్పంచ్ .. అతివదే ఆధిక్యం

తిరుపతి అర్బన్: జిల్లాలో ఐదు పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించారు. వీటిలో నాలుగు పంచాయతీల్లో మహిళలకే పట్టం కట్టారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి ఉప సర్పంచ్‌గా పి.కవిత, పుత్తూరు మండలం పీఆర్ మంగళం ఉప సర్పంచ్‌గా ఏఎస్ మంజుల, సత్యవేడు మండలం తూర్పుమాలవారిపాళెం ఉప సర్పంచ్‌గా వి.గిరిజ, తిరుచానూరు ఉప సర్పంచ్‌గా వై.సుప్రియ, పిచ్చాటూరు మండలంలోని అడవీశంకరాపురం ఉప సర్పంచ్‌గా వి.రామమూర్తి ఎన్నికయ్యారు.

రహదారిపై జింక హల్‌చల్


దీవీ సత్రం జాతీయ రహదారిపై సంచరిస్తున్న చుక్కల జింక

దొరవారిసత్రం: మండలంలోని జాతీయ రహదారిపై బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఓ కృష్ణజింక హల్‌చల్ చేసింది. దీన్ని చూసేందుకు స్థానికులు హడావుడి చేశారు. జింక రహదారి పైకి రావడంతో ఎక్కడ వాహనాలు ఢీకొడతాయోనని పలువురు ఆందోళన చెందారు. చివరికి స్థానికులు నేలపట్టు పక్షుల కేంద్రం అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి, జింకను పట్టుకుని కేంద్రంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

విద్యార్థినితో టీచర్ అసభ్య ప్రవర్తన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినితో గణిత ఉపాధ్యాయుడు సీ.రవి అసభ్యంగా ప్రవర్తించింది. గణిత ఉపాధ్యాయుడు సీ.రవి తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థిని క్లాస్ టీచర్‌కు తెలపగా ఆమె ప్రధానోపాధ్యాయురాలు గాయత్రికి ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి మంగళవారం రాత్రి ఎంఈఓ రవీంద్రనాథ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన విద్యార్థిని విచారించి, రిపోర్టు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు సీ.రవిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్ణ శోభితం.. కృష్ణమందిరం

వెన్నముద్ద వేణుగోపాలుడి జన్మదిన సంబరానికి కృష్ణ మందిరం ముస్తాబైంది. వివిధ వర్ణాల విద్యుద్దీపాల వెలుగులతో శోభిల్లుతోంది. అష్టసఖులు విశేషాలంకరణలో దర్శనమిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో ఇస్కాన్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు.

- నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- ముస్తాబైన ఇస్కాన్ మందిరం


ముస్తాబైన ఇస్కాన్ మందిరం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కాన్ అధ్యక్షుడు రేవతి రమణదాస్

తిరుపతి కల్చరల్: నగరంలోని ఇస్కాన్ కమల మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇస్కాన్ మందిరం రంగు రంగుల విద్యుద్దీపాలంకరణలు, శ్రీకృష్ణుని ప్రతిరూపాలు, చిత్రపటాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు అయ్యింది. జన్మాష్టమి నాడు శ్రీరాధాగోవిందులను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద పోలీసు బందోబస్తు, ఇస్కాన్ సెక్యూరిటీ సిబ్బంది, ప్రత్యేకంగా ఇస్కాన్ మందిర వలంటీర్లను ఏర్పాటు చేశారు. జన్మాష్టమి సందర్భంగా గురువారం వేకువజామున 4.30 గంటలకు ఆలయంలో నిర్వహించే మంగళ హారతి, తులసి పూజ, నరసింహకీర్తన, జపంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఇస్కాన్ కమలమందిరంలోని శ్రీరాధాగోవిందులతో పాటు అష్టసఖులను వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువు తీర్చనున్నారు. ఉదయం 8.30 నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు శ్రీరాధాగోవిందుల దర్శనం కల్పించనున్నారు. కాగా సాయంత్రం 6.30 గంటలకు ఇస్కాన్ ముందున్న టీటీడీ మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముఖ్య అతిథుల ప్రసంగం, శ్రీకృష్ణజన్మాష్టమి విశిష్ట గురించి వివరిస్తారు. అనంతరం రాత్రి 11 గంటలకు శ్రీరాధాగోవిందులకు విశిష్టమైన మహా శంఖాభిషేకం చేయనున్నారు. ఇందులో భాగంగా శ్రీరాధాగోవిందులకు వివిధ సుగంధ ద్రవాలతో ప్రత్యేక అభిషేకం చేయనున్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

ఇస్కాన్ కమల మందిరంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా చేపడుతున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ తెలిపారు. బుధవారం ఇస్కాన్ మందిరంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా వేలాది కేంద్రాల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి ఇస్కాన్ మందిరంలో గురు, శుక్రవారాల్లో ఈ వేడుకలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ వేడుకలకు సుమారు 2 లక్షల మంది భక్తులు శ్రీరాధాగోవిందులను దర్శించుకొనే దిశగా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లు, భద్రతా సిబ్బంది, ప్రసాదాలు వంటి సౌకర్యాలు చేపట్టామని తెలిపారు. గురువారం ఉదయం 4.30 గంటలకు చేపట్టే మంగళహారతి, తులసీపూజ, నరసింహకీర్తనజపంతో జన్మాష్టమి వేడుకలు ఆరంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ కార్యదర్శి పీఆర్వో లీలాపారాయణదాస్, రూపేష్ ప్రభు, ప్రతినిధులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,110
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

యువకుడి ఆత్మహత్య

రామకుప్పం: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు కథనం మేరకు, మండలంలోని ననియాలతండాకు చెందిన గోపీనాయక్(23) తన మిత్రులతో కలసి ఎకో టూరిజం సమీపంలో మద్యం తాగారు. మద్యం మత్తులో మిత్రుల మధ్య గొడవ జరిగింది. అనంతరం మిత్రులు గోపీనాయక్‌ను ఇంటి వద్ద వదిలివెళ్లారు. ఈ క్రమంలో రాత్రి గోపినాయక్ ఇంటి పైకప్పు కొక్కీకి ఉరివేసుకుని మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని అన్న నాగరాజు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

తిరుపతి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా నుంచి ఆయన బుధవారం జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీతో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఏఎన్‌ఎంలు ఇంటింటా వ్యాధులపై సర్వే చేపట్టాలని తెలిపారు. అనంతరం 30వ తేదీ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న సమాచారాన్ని వలంటీర్ల ద్వారా అందరికీ తెలియజేయాలని చెప్పారు. ఆ మేరకు మెడికల్ క్యాంపుల్లో రోగులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. అవసరం అయిన కేసులను ఆరోగ్యశ్రీకి పంపించాలని తెలిపారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో రోగాల ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, జిల్లాస్థాయిలో డీఎంహెచ్‌ఓ సమీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీఈఓ వి. శేఖర్, డీపీఎంఓ శ్రీనివాసులు, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త రాజశేఖర్ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు గూడూరులో జాబ్ మేళా

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరు గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్యామ్‌మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. అదనపు సమాచారం కోసం 8143576866 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రజా శ్రేయస్సు దిశగా టీటీడీ నిర్ణయాలు

- టీటీడీ పాలక మండలి, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు
- ప్రజలకు ఉపయోగకరంగా నగర అభివృద్ధి
- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించే దిశగా వైఎస్సార్ సీపీ అడుగు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి వెల్లడి


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ పాలకమండలి ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలు నగరవాసులకు ఎంతో దోహదకరంగా ఉండడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ కార్పొరేటర్లతో కలిసి ఆయన మాట్లాడారు. కైలాసగిరి జలాశయం తిరుపతికి మరింత నీటి అందించేందుకు అదనంగా రెండో పైప్‌లైన్ ఏర్పాటుకు టీటీడీ నిర్ణయం తీసుకుందన్నారు. కైలాసగిరి జలాశయం నుంచి తిరుపతికి నీటిని తెచ్చేందుకు 40 కిలోమీటర్ల దూరం ఇప్పటికే తొలి పైప్‌లైన్ పనులు పూర్తి అయ్యాయని, రెండవ పైప్‌లైన్ పూర్తి చేసి మంచినీటిని తిరుపతి ప్రజలకు అందించే దిశగా నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈ పనులు పూర్తి అయితే మరో 20 ఏళ్ల వరకు తిరుపతికి నీటి ఎద్దడి ఉండదన్నారు. అలాగే కరకంబాడి రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా నుంచి తిరుచానూరుకు వచ్చే భక్తులు సులభతరంగా చేరుకునే దిశగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లె భూములకు సైతం పరిష్కారం మార్గం చూపడం తోపాటు ఇప్పటికే సర్వే కూడా పూర్తి చేశారన్నారు. తిరుపతి నగరంలోని గుంటలు, చెరువుల ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న సుమారు 5 వేల మందికిపైగా తొలి దశలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇచ్చిన హామీ మేరకు వారి స్థలాలను 22ఏ నిషేధిత జీఓ నుంచి విముక్తి కల్పించడం జరిగిందన్నారు. దీనిపై ప్రజలు అనేక సార్లు గత టీడీపీ ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోలేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం రోజు వారీ లక్షలాది మంది తిరుపతికి చేరుకుంటున్నారని తెలిపారు. తిరుమలకు తిరుపతి సర్వీస్ సిటీగా సేవలు అందిస్తోందన్నారు. అలాంటి తిరుపతి నగరం పరిశుభ్రతతో సుందర నగరంగా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం నగరంలో భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో పరిశుభ్రత కోసం 1600 మంది పారిశుద్ధ్య కార్మికులు అదనంగా టీటీడీ ఏర్పాటు చేయగలిగితే పరిశుభ్రమైన నగరంగా తిరుపతిని రూపొందించుకోవచ్చని తెలిపారు. నగర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం తీసుకునే కొన్ని నిర్ణయాల పట్ల కొన్ని రాజకీయ పార్టీలు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ఈనేపథ్యంలో స్థానికులు గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి విమర్శకులకు సమాధానం ప్రజా క్షేత్రం నుంచే రావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే. బాబు, కో ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, వెంకటరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

18 నాటికి శ్రీనివాస సేతు పూర్తి కావాలి

తిరుపతి తుడా : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 18వ తేదీన శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశించారు. బుధవారం టీటీడీ పరిపాల భవనంలోని తన చాంబర్‌లో టీటీడీ, మున్సిపల్ అధికారులతో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి ట్రయిల్ రన్ నిర్వహించేలా పనులు పూర్తి చేయాలని, 18 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇంకా నగరంలో పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ డివైడర్లు, కాలువలు, ఫుట్‌పాత్‌లు, వీధుల ఆధునీకరణ, పెయింటింగ్, క్రాష్ బ్యారియర్లు, బీటీ రోడ్డు, సుందరీకరణ తదితర పనులను ఈనెల18 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ హరితకు సూచించారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ ఎస్ఈ మోహన్, ఈఈ చంద్ర శేఖర్, ఆఫ్కాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురుగేషన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన


ఊట్లపల్లెలో షేక్ నూరుల్లా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: అమ్మా.. రాష్ట్రంలో పాలన బాగుందా? అని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గాజుల వీధికి చెందిన పి రమాదేవి అనే మహిళ అడిగారు. అందుకు ఆమె సమాధానమిస్తూ అయ్యా.. రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోంది.. పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగను చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జీఓ విడదల చేయడం హర్షణీయం అన్నారు. అలాగే బాలాయపల్లి మండలం ఊట్లపల్లెలో జరిగిన కార్యక్రమంలో నేదురుమల్లి ఆ గ్రామానికి చెందిన షేక్ నూరెల్లతో మాట్లాడుతూ అమ్మా అన్ని పథకాలు అందుతున్నాయా? అని అడిగారు. అందుకు ఆమె సమాధానమిస్తూ.. మా కుటుంబానికి అన్నీ పథకాలు వస్తున్నాయని చెప్పారు. వెంకటగిరి, బాలాయపల్లె మండలాల్లో ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ముత్యం లాంటి తమ్ముడిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నా!



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ముత్యాల పార్థసారథికి పార్టీ కండువా కప్పి, ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

- ముత్యాల పార్థసారథి వైఎస్సార్ సీపీలో చేరిక

శ్రీకాళహస్తి: ముత్యం లాంటి తమ్ముడిని వైఎస్సార్ సీపీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ శ్రీకాళహస్తి మాజీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథి, ట్రస్టుబోర్డు మాజీ సభ్యురాలు ప్రమీలమ్మ, మాజీ కౌన్సిలర్ పద్మ వారి అనుచరులు సుమారు 500 మంది బుధవరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీకాళహస్తి పట్టణం భేరివారి మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యురాలు ప్రమీలమ్మ మరో 500 మంది టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతోమంది పార్టీలో చేరుతామన్నా, మచ్చలేని వారినే తీసుకుంటున్నామని అన్నారు. కొన్నల రమేష్, మల్లికార్జునగౌడ్, జయగోపాల్ వంటి వారు తమ పార్టీలోకి వచ్చారన్నారు. నేడు శ్రీకాళహస్తి పట్టణ పురపాలకసంఘ మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథి పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ముత్యాల పార్థసారథి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయని, నియోజకవర్గంలో లబ్ధి పొందని ఇల్లే లేదన్నారు. ఇన్ని సంవత్సరాల రాజకీయ జీవితంలో ఇలాంటి ఎమ్మెల్యేను చూడలేదన్నారు. ఈకార్యక్రమంలో గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, టౌన్ బ్యాంకు చైర్మన్ శెట్టిపల్లి సురేష్, ముత్యాల వెంకట కృష్ణ, ఉన్నం వాసునాయుడు, చంద్రయ్యనాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి, బుల్లెట్ జయశ్యామ్, గవర్ల కృష్ణయ్య, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, లక్కమనేని మధు, కంఠా ఉదయ్‌కుమార్,చిన్న, మస్తాన్, కొల్లూరు హరినాయుడు, ఆశా కిరణ్, మధురెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సిద్ధంకండి


మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: మరో పది రోజుల్లో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయని, ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రజారవాణాధికారి(డీపీటీఓ) చెంగల్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన అలిపిరి, మంగళం డిపోలను తనిఖీ చేశారు. తొలుత అలిపిరి డిపోలో పలు సర్వీసుల కండిషన్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో అలిపిరి డిపో కీలకంగా వ్యవహరించాల్సిన నేపథ్యంలో అన్ని సర్వీసులను సిద్ధంగా ఉంచుకోవాలని డిపో మేనేజర్ హరిబాబుకు సూచించారు. చిన్నపాటి సమస్య ఉన్నా మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. అంతే తప్ప చిన్న సమస్యే కదా అంటూ నిర్లక్ష్యం చూపవద్దని చెప్పారు. ఏఏ డిపోల నుంచి బ్రహ్మోత్సవాల్లో తిరుమలకు నడపాల్సి ఉందనే అంశాలను త్వరలో తెలియజేస్తామని, అయితే ప్రస్తుతం అన్ని సర్వీసులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం మంగళం డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యారేజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెకానిక్‌లు ప్రతి సర్వీస్‌ను నిశితంగా పరిశీలించి, మరమ్మతులు చేయాలని సూచించారు. అవసరం అయిన చోట కొత్త వస్తువులను అమర్చాలన్నారు. ఏఏ వస్తువులు అవసరం ఉందో తెలియజేస్తే వాటిని తెప్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దేశవిదేశాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అత్యవసరం అయితే తప్ప సెలవులు పెట్టకూడదని సూచించారు. మెకానికల్ ఇంజినీర్ నరసింహులు, మంగళం డిపో మేనేజర్ భాస్కర్‌రావు, డిపో అసిస్టెంట్ మేనేజర్ నిర్మల పాల్గొన్నారు.